ముమ్మరంగా వరి కోతలు

- వెంటాడుతున్న వరుణుడి భయం
- పసిమి మీదనే ధాన్యం విక్రయాలు
- వడగండ్ల వానతో తగ్గిన దిగుబడులు


ఎల్లావత్తుల సమీపంలో వరి కోత కోస్తున్న యంత్రం,


డి.కొట్టాల వద్ద పసిమి వరి ధాన్యం సంచులను లారీలోకి చేర్చుతున్న దృశ్యం

రుద్రవరం: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కాలం పూర్తి కావడంతో రైతులు యంత్రాల ద్వారా కోతలు సాగిస్తున్నారు. ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో పసిమి ఉండగానే విక్రయిస్తున్నారు. సాధారణంగా కోత కోసిన తరువాత ధర హెచ్చు, తగ్గులు, తమ అవసరాలను చూసుకొని విక్రయించేవారు. అయితే ఈ ఏడాది కురుస్తున్న అకాల వర్షాలకు భయపడి కోసిన ధాన్యాన్ని వెంటనే అలాగే అమ్మేస్తున్నారు. అలాగే.. కురిసిన వడగండ్ల వాన దెబ్బతీయడంతో దిగుబడులు తగ్గాయని రైతులు వాపోతున్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రైతులు రబీ సీజన్‌లో బోరు బావులు, చెరువు, తెలుగుగంగ కాల్వల కింద నంద్యాల సోన, కర్నూలు సోన, షుగర్ లెస్ వంటి వరి పంట దాదాపు ఆరు వేల హెక్టార్లలో సాగు చేశారు. ఎకరానికి దాదాపు రూ.30వేల వరకు ఖర్చు చేశారు. ఖరీఫ్ సీజన్ లాగే రబీలో కూడా మంచి దిగుబడులు వస్తాయనే ఆశలు రైతుల్లో ఉండేవి. అయితే పంట చేతికొచ్చే సమయంలో వడగండ్ల వాన కురవడంతో పంట నేల వాలింది. ప్రస్తుతం ఎల్లావత్తుల, డీ.కొట్టాల,టీ.లింగదిన్నె,చిత్రేనిపల్లె తదితర గ్రామాల వైపు వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఎకరాలో వరి పంట కోత కోయించాలంటే కేవలం రూ.1500 ఖర్చయ్యేది. పంట నేల వాలడంతో ప్రస్తుతం రూ.3500 వెచ్చించాల్సి వస్తోంది. ఎకరాకు 45 నుంచి 50 బస్తాల దిగుబడి వస్తుందని భావించిన రైతులకు 35 బస్తాలకే పడి పోయిందని ఆవేదన చెందుతున్నారు.

పసిమి మీదనే విక్రయాలు



మూడెకరాల్లో షుగర్‌లెస్ వరి పంట సాగు చేశాం. పంట సాగుకు ఎకరాకు రూ.35 వేలు ఖర్చయ్యింది. అయితే దిగుబడి 30 బస్తాలకు మించడంలేదు. వడగండ్ల వాన కారణంగా పంట నేల వాలడం వల్ల తేమ శాతం అధికమై గింజ రంగు మారుతుందని కోసిన వెంటనే పసిమి మీదనే బస్తా (75కేజీలు) రూ.1650 ప్రకారం విక్రయించుకుంటున్నాం.ఖర్చులు పెరిగినప్పటికీ గిట్టుబాటు ధర లభించడంతో నష్టాల నుంచి గట్టెక్కాం.

– వెంకటలక్ష్మమ్మ, మహిళా రైతు డీ.కొట్టాల

సీమకు అన్యాయం జరిగితే ఉద్యమం ఉధృతం

నంద్యాల(అర్బన్):రాయలసీమకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని, ఇలాగే కొనసాగితే ఉద్యమం ఉధృతం చేస్తామని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం అప్పర్‌భద్ర ప్రాజెక్టు కడితే సీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.పట్టణంలోని ఓ హోటల్‌లో సోమవారం ఉమ్మడి నాలుగు జిల్లాల స్టీరింగ్ కమిటీ నేతలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీమలో ఐరన్‌ఓర్, సున్నపు, బంగారు గనులు, వర్షాలు వస్తే వజ్రాలు, అటవీ సంపద, ఎర్రచందనం పుష్కలంగా ఉన్నాయని, అయినా ఇక్కడి ప్రజల జీవితాలు దుర్లభంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ సమస్యలపై ఈనెల 24న కర్నూలు ఎస్టీబీసీగ్రౌండ్‌లో నిరసనదీక్షలు చేపట్టబోతున్నామని తెలిపారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కర్నూలు(రాజ్‌విహార్):విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వినియోగదారులు తమ సమస్యలను సెల్ 73826 14308 నంబరుకు ఫోన్ చేసి చెప్పుకొని పరిష్కారం పొందవచ్చని వెల్లడించారు.

క్లుప్తంగా

కరాటే క్రీడాకారులకు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): అన్నమయ్య జిల్లా పీలేరులో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ జీత్‌కునేడో కరాటే చాంపియన్ పోటీల్లో నంద్యాలకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించడంతో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ సోమవారం కార్యాలయంలో అభినందించారు.ఆయన మాట్లాడుతూ పతకాలు సాధించిన ఆస్మా, నాగేంద్ర, రాజు బంగారు పతకాలు సాధించగా సుహాన, ఆదిల్, హార్తిక్, సుధీర్ రజత పతకాలు, పునీత్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. కరాటే మాస్టర్లు బాలకృష్ణ, లాల్‌తరుణ్, రమణయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లెలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నామని ఆ శాఖ ఏఈ రాఘవేంద్రారెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన స్తంభాలు కావడంతో శిథిలావస్తకు చేరాయి. విషయాన్ని గ్రామస్తులు ఏఈ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఉన్నతాధికారులకు వివరించడంతో నూతన స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పాత వాటిని తొలగించి 14 కొత్త స్తంభాలు అమర్చినట్లు ఏఈ చెప్పారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక పెద్దమ్మ ప్రాంగణం, అమ్మవారిశాల సెంటర్, గ్రామ పంచాచతీ ఆఫీసు, జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం బైరిహరి, శంకర్,బ్రహ్మం ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రాలను ఎంపీపీ బాలస్వామి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లం పుల్లయ్య, ఏర్వ కృష్ణమూర్తి ప్రారంభించారు. కార్యదర్శి మహ్మద్‌రఫీ,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేయండి


చిలకలూరు వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డీఈఈ

రుద్రవరం: పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తి చేసి చిలకలూరు గ్రామస్తులకు తాగునీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కే.మురళీధర్ రావు సూచించారు. మండలంలోని చిలకలూరు గ్రామస్తులకు ఎన్నోఏళ్లుగా నీటిసమస్య వేదిస్తోంది.పక్కనే వక్కిలేరు వాగులో చెలిమల ద్వారా నీరు తెచ్చుకొని తాగేవారు. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఎంతగానో శ్రమించారు. అయితే గ్రామం చుట్టు పక్కల ఎక్కడ బోరు వేసినా ఉప్పు నీరు పడుతుండటంతో సమస్యగానే మిగిలిపోయింది. దీంతో మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎంపీ నిధుల నుంచి రూ.28.50లక్షలు మంజూరు చేయించారు.దీంతో అధికారులు గత కొద్ది రోజల క్రితం చిలకలూరు –చందలూరు గ్రామాల మధ్య వాగు సమీపంలో నూతన బోరు వేయించడంతో మంచి నీరు లభించింది. అక్కడి నుంచి గ్రామంలోకి నీ రు సరఫరా చేసేందుకు పైప్‌లైన్ పనులు చేపట్టారు.ఆపనులను డీఈఈ సోమవారం పరిశీలించారు.

మున్సిపల్ స్పందనకు 4 వినతులు

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 4 వినతులు వచ్చాయి. పట్టణంలోని 48 సచివాలయాలల్లో ప్రతి రోజూ నిర్వహించే స్పందనకు వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నందున మున్సిపల్ స్పందనకు ఫిర్యాదుల తగ్గాయన్నారు. ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించిన ఫిర్యాదు ఒకటి, ఎన్‌క్రోచ్‌మెంట్ ఒకటి, టౌన్ ప్లానింగ్ సంబంధించి ఎన్‌ఓసీ ఇవ్వాలని ఒక ఫిర్యాదు అందగా టిడ్కో గృహాలపై ఒక వినతి పత్రం వచ్చిందని వివరించారు.

ఉత్సవాలను జయప్రదం చేద్దాం

నంద్యాల(అర్బన్): ఈనెల 5న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నామని ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, అధికారులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిణి చింతామణి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. కొత్తబస్టాండ్ వద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక విక్టోరియా రీడింగ్ రూం ఆవరణలో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడుదాం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నంద్యాల(అర్బన్): నల్లధనాన్ని తెచ్చి ప్రతి వ్యక్తి అకౌంట్‌లో రూ.15లక్షలు వేస్తానని, అవినీతి లేని పాలన అందిస్తానని, రైతులకు రెట్టింపు ఆదాయం కల్పిస్తానంటూ అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ అవన్ని మరిచి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే పనిలో ఉన్నారని, అటువంటి పాలనకు చరమగీతం పాడుదామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న, సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. రూ.410 సిలిండర్ ధరను రూ.1200కు పెంచడం, చమురు రంగంలో బ్యారెల్ ధర తక్కువగా ఉన్నా పెట్రోల్, డీజల్ ధరలు ఆకాశన్నంటడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలని, హంద్రీనీవా ద్వారా చెరువులు నింపాలని కోరారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి


డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలు, స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు అబ్బాస్ కోరారు. ఆయాలను పారిశుద్ధ్య కార్మికులకు వర్తించే జీవోల ప్రకారం రూ.21వేల వేతనం చెల్లించాలంటూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వంద మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో అదనపు ఆయాను ఏర్పాటు చేయాలని, పాఠశాల మెర్జ్ ప్రక్రియలో తొలగించబడిన ఆయాలకు మరో చోట ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివబాలకృష్ణ, కుల్లాయిస్వామి, పుల్లమ్మ, సుబ్బమ్మ, రమణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీశైలంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ


శ్రీశైలంలో భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో వారాంతపు రోజులైన శని, ఆదివారాల్లో పెరిగిన రద్దీ శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం కూడా కొనసాగింది. భక్తులతో శ్రీశైలక్షేత్రంలోని పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. వేకువజామునే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించుకోవడానికి తరలి రావడంతో పాతాళగంగ స్నానఘట్టాలు కిటకిటలాడుతూ కనిపించాయి. ఆలయాధికారులు క్యూలలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు.

మహానందిలో మహారాష్ట్ర భక్తుల సందడి


మహానందీశుడిడిని దర్శించుకొని వస్తున్న మహారాష్ట్ర భక్తులు

మహానంది: మహానంది ఆలయంలో సోమవారం మహారాష్ట్ర భక్తుల సందడి నెలకొంది. స్వామివారికి ప్రీతికరమైన వారం కావడంతో రెండు తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులు ముందుగా కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లను దర్శించుకున్నారు. వేకువజాము నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనాలు రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగాయి.

శనగల బసవన్నకు పరోక్షసేవ


మహానందీశుడికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం


బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి సోమవారం త్రయోదశి సందర్భంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు శాస్త్రోక్తంగా విశేషపూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను గావించారు. స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

పల్లకీలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, అలంకార హారతులు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం నిర్వహించారు.


ఉయ్యాలవాడలో పరీక్షకు హాజరైన విద్యార్థులు


రుద్రవరంలో విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపుతున్న దృశ్యం

ప్రశాంతంగా ‘పది’ పరీక్షలు ప్రారంభం


దొర్నిపాడులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు తల్లిదండ్రుల కోలాహలం

ఉయ్యాలవాడ : మండలంలో పదో తరగతి పరీక్షలు తొలి రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. తెలుగు పరీక్షకు 353 మంది విద్యార్థులు హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 175 మంది హాజరు కాగా, ఏపీ మోడల్‌స్కూల్ కేంద్రంలో 181 మందికి గాను 178 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపర్‌వైజర్లు నూర్జహాన్, వెంకటశకుంతల తెలిపారు.ఇదిలా ఉండగా.. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులు పరీక్ష సామాగ్రిని వసతి గృహ సంక్షేమాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం అందజేసి పరీక్షలు బాగా రాయాలని సూచించారు.

దొర్నిపాడు: పది పరీక్షల్లో భాగంగా తొలిరోజు సోమవారం కేంద్రాల నుంచి విద్యార్థులు ఆనందంగా బయటికి వచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 212 విద్యార్థులకు గాను వందశాతం హాజరైనట్లు పరీక్షల చీఫ్ రాజు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసినట్లు చెప్పారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాట్లు చేశామన్నారు.

రుద్రవరం:మండలంలో సోమవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాతంగా సాగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, తువ్వపల్లె తిప్పమీదనున్న ఏపీ మోడల్ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో దాదాపు 400 విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్, డిపార్టుమెంట్ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష మొదలు కాగా పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులే విద్యార్థులను కేంద్రాల వద్దకు తీసుకొచ్చారు. పోలీసులు, ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. వారు పరీక్ష రాసి వచ్చే వరకు తల్లిదండ్రులు ఆరుబయట, చెట్ల కింద సేదదీరారు. పరీక్ష రాసి బయటకు రాగానే రాసిన తీరును తల్లిదండ్రులకు వివరించారు. పరీక్ష ముగిసే సమయంలో స్క్వాడ్ క్రిష్టఫర్ బృందం రుద్రవరం పాఠశాలకు చేరుకొని తనిఖీ చేశారు. పరీక్ష పూర్తి కాగానే వారి సమక్షంలో జవాబు పేపర్లను కట్టకట్టి సీల్ వేశారు. దొర్నిపాడు మండలంలో ఒకటి, ఆళ్లగడ్డలో నాలుగు, రుద్రవరంలో ఒకటి చొప్పు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు.

ఫ్యూజుల తొలగింపు..

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు 7 గదులను ఎంపిక చేసి అందులో విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే సోమవారం ఉదయం బల్బులు వెలగక పోవడం, ఫ్యాన్లు తిరగక పోవడం, సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో అవాక్కయ్యారు.వెంటనే విద్యుత్ సిబ్బందిని పిలపించగా వారు పరిశీలించి విద్యుత్ సౌకర్యం లేకుండా ఫ్యూజులు తీసేశారని, దీంతో ఫ్యూజులను సరిచేయడంతో విద్యుత్ అంతరాయం తొలగింది.

శిరివెళ్ల: మండలంలో సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 569 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా మొదటి రోజు తెలుగు పరీక్ష 568 మంది రాశారు.యర్రగుంట్ల బీ సెంటర్‌లో ఒక్క విద్యార్థి పరీక్షకు గైర్హాజరయ్యాడు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. తాగునీరు, వైద్య సేవలపై ఆయా కేంద్రాల చీఫ్‌లను ఆరా తీశారు. కేంద్రాల వద్ద ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. కాగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.


పరీక్ష రాసిన విధానాన్ని తల్లిదండ్రులకు వివరిస్తున్న విద్యార్థులు


రుద్రవరంలో స్క్వాడ్ సమక్షంలో జవాబు పేపర్లను సీల్ చేస్తున్న దృశ్యం


శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద పోలీస్ బందోబస్తు

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం

కొత్తపల్లి: అదుపుతప్పి ట్రాక్టర్‌బోల్తా పడడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని చిన్నగుమ్మడాపురం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు మండలంలోని ఎం.లింగాపురం గ్రామానికి చెందిన మాడుగుల ఆంజనేయులు(అంజలన్న)కు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు సంతానం. ఆంజనేయులు రెండునెలల క్రితం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్‌కు అవసరమైన వ్యవసాయ పనిముట్లను చిన్న కుమారుడు మాడుగుల శ్రీకాంత్(25)తో కలిసి చిన్నగుమ్మడాపురం గ్రామం నుంచి తీసుకొచ్చే క్రమంలో గ్రామ సమీపంలోని బస్సు షెల్టర్ వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న వాగులో పడింది. దీంతో శ్రీకాంత్ ముక్కులో నుంచి రక్తం వచ్చి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాన్ని ప్రభుత్వమే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని బీకేఎంయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు కోరారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం బీకేఎంయూ ఆధ్వర్యంలో రైతునగరం సచివాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ వ్యయాన్ని రూ.5లక్షలకు పెంచి, కంకర, సిమెంట్, ఇసుక, స్టీల్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. బాషా, బాలరాజు, రమేష్, శ్రీనివాస్, వెంకటేశ్వరు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


నూనెపల్లెలో కూల్ మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు కూల్ మినరల్ వాటర్ అందించేందుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలివేంద్రాలను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించనున్నట్లు చెప్పారు. నాయకులు సిమెంట్ ప్రసాదరెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్, చంద్రనాథరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సురేష్, శివ, మధు పాల్గొన్నారు.

మహానంది ఆలయంలో కార్పెట్ల ఏర్పాటు


ఆలయం నుంచి బయటికి వచ్చే మార్గంలో కార్పెట్ వేసిన దృశ్యం

మహానంది: మహానందీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనం చేసుకుని బయటికి వచ్చేమార్గం, ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఉన్న క్యూలైన్లలో అధికారులు తాత్కాలికంగా కార్పెట్లు వేశారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో సౌకర్యాలు లేకపోవడంతో మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల కాళ్లు మండుతున్నాయనే విషయంపై ఆదివారం సాక్షి దినపత్రికలో ‘‘హే...‘భగవాన్’’ శీర్షికన ప్రచురించిన వార్తకు ఆలయ అధికారులు స్పందించారు. ఈ మేరకు కార్పెట్లు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా గతంలో వేసవికాలంలో చలువపందిళ్లు ఏర్పాటు చేసేవారు. అయితే గత కొన్నేళ్లుగా వాటి ఊసేలేదు. అధికారులు స్పందించి క్యూలైన్ల వెంట నీడ కల్పించేందుకు షెడ్లు లేదా షామియానాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

నేడు మహానందికి చాగంటి

మహానంది: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉదయం మహానందికి వస్తున్నట్లు ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు సోమవారం తెలిపారు. నంద్యాలలోని ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానం వద్ద ప్రవచనాలను చెప్పేందుకు వస్తున్న ఆయన ఉదయం ఏడు గంటలకు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు రానున్నారని చెప్పారు.